www.aksharamedassu.com

APTEL/26/A8343

తెలుగుపత్రిక

అక్షర మేధస్సు

అక్షరమే ఆయుధం మేధస్సే మా మార్గం

ప్రచురణ : అనంతపురం సత్యసాయి | ఎడిటర్ : యన్ రంగనాథ్ | సంపుటి : 01 | సంచిక : 34 | పేజీలు : 04 | మంగళవారం 24 - 11 - 2026 | వెల : 01/-



ఫేసియల్ రికగ్నిషన్‌తో

గ్లోబల్ సమ్మిట్

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గ్లోబల్ సమిట్‌పై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు
- కార్యక్రమ ఏర్పాట్లు, విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు
- ఫేసియల్ రికగ్నిషన్‌తో గ్లోబల్ సమ్మిట్ ప్రతినిధులకు ప్రవేశం
- గ్లోబల్ సమిట్‌పై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



హైదరాబాద్ :

గ్లోబల్ సమ్మిట్ 2026కు రానున్న ప్రతినిధుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది హెచ్చరించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై బోధి పెవెలియన్‌లో సమీక్ష చేశారు. ఫేసియల్ రికగ్నిషన్ ద్వారా గ్లోబల్ సమ్మిట్ ప్రతినిధులకు ప్రవేశం కల్పించాలని తెలిపారు.డెలిగేట్లతో అత్యంత మర్యాదగా వ్యవహరించేలా విధుల్లో ఉన్న అధికారులకు శిక్షణ ఇవ్వాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రతినిధుల కోసం ఫుడ్ కోర్టులు, మెరుగైన ఇంటర్నెట్ నెట్‌వర్క్ సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విమానాశ్రయంలో దిగినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు అతిథుల కోసం ప్రత్యేక లైజనింగ్ ఆఫీసర్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. సమ్మక్క సారలమ్మ ఆలయంలోని తోరణాల నమూనాలను గ్లోబల్ సమ్మిట్‌లో ఉపయోగించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. సమ్మిట్‌లో భాగంగా - మిగతా 2 లో



కేటీఆర్ ఊహా ప్రపంచంలో

బతుకుతున్నారు

- భట్టి ఘాటు వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఇక కలేనన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కేటీఆర్ వాస్తవాలు పదిలేసి సోషల్ మీడియా లోకంలోనే ఉంటున్నారని వ్యాఖ్య
- తమ గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తోందన్న విమర్శ

హైదరాబాద్ :

తెలంగాణలో ప్రజలకు సంక్షేమం అందిస్తూ, రాష్ట్ర ప్రయోజనాల - మిగతా 2 లో

గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు

రూ.1,115 కోట్ల కేటాయింపు



- గోదావరి పుష్కరాల లోగో డిజైన్ వర్క్ షాప్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు
- ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు
- 2027 జూన్ 26 నుంచి జులై 07 తేదీ వరకు 77 ప్రాంతాల్లో ఘనంగా పుష్కరాలు

హైదరాబాద్ :

గోదావరి పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేపడుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని లోగో, ట్యాగ్‌లైన్ రూపకల్పనపై ఇవాళ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో - మిగతా 2 లో



సూరత్-బిలిమోరా మధ్య బుల్లెట్ రైలు ట్రయల్ రన్

- కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ కీలక అప్‌డేట్
- మే 2027లో సూరత్-బిలిమోరా మధ్య బుల్లెట్ రైలు ట్రయల్స్
- గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్న బి-28 రైలు
- 2029 నాటికి థానే వరకు విస్తరించనున్న సేవలు
- 508 కిలోమీటర్ల మేర శరవేగంగా సాగుతున్న ప్రాజెక్టు పనులు

ఢిల్లీ :

దేశంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టు మరో కీలక మైలురాయికి చేరుకుంది. ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్‌లో భాగంగా గుజరాత్‌లోని సూరత్-బిలిమోరా మధ్య గల 50 కిలోమీటర్ల మార్గంలో 2027 మే నెలలో ప్రయోగాత్మక పరీక్షలు (ట్రయల్ రన్స్) ప్రారంభం కానున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశంలో హైస్పీడ్ రైలు వ్యవస్థకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరీక్షలు జరగనున్న మొట్టమొదటి మార్గం ఇదే కావడం విశేషం.ఈ మార్గానికి సంబంధించి విద్యుద్దీకరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని రైల్వే మంత్రి తెలిపారు. ఎలివేటెడ్ ట్రాక్‌పై ఉన్న అప్, డౌన్ లైన్లకు నవంబర్ 20న విజయవంతంగా విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ కారిడార్ కోసం అత్యాధునిక 2ఞ25 కేవీ ట్రాక్షన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. బిలిమోరా వద్ద ట్రాక్షన్ సబ్‌స్టేషన్ పనులు కూడా ముగిశాయి. ఇక ఈ సెక్షన్‌లో మిగిలి ఉన్న సిగ్నలింగ్ పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టును దశలవారీగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా అహ్మదాబాద్ నుంచి వాపీ వరకు ఉన్న విభాగాన్ని 2027 చివరి నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. అనంతరం 2029 నాటికి ఈ సేవలను మహారాష్ట్రలోని థానే వరకు విస్తరించనున్నారు. దేశంలో మొట్టమొదటి కమర్షియల్ హైస్పీడ్ రైలు సర్వీస్ 2027 చివరి త్రైమాసికంలోనే ప్రారంభం - మిగతా 2 లో

నేపాల్ అభివృద్ధికి రూ.24 వేల కోట్ల

ఆర్థిక సాయం



- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు బలపేతమే లక్ష్యం
- భారత్-నేపాల్ ప్రధానుల సంయుక్త ప్రకటన చేశారు
- ప్రధాని మోదీ, నేపాల్ ప్రధాని బాలేందర్ షా సమక్షంలో ఒప్పందాలు చేసుకున్నారు

ఢిల్లీ :

నేపాల్‌లో అభివృద్ధి పనులకు భారత్ రూ. 24 వేల కోట్ల సాయం అందించనుంది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు బలపేతమే లక్ష్యంగా భారత్‌లో పర్యటిస్తున్న నేపాల్ ప్రధాని బాలేంద్ర షా దిల్లీలోని - మిగతా 2 లో



పాకిస్థాన్‌లో తీవ్ర

గ్యాస్ సంక్షోభం

- వంట చేసుకోలేక ప్రజల అవస్థలు
- వంట గ్యాస్ కొరతతో ఆకాశాన్నంటిన ఎల్పీజీ ధరలు
- ఖైబర్ పఖ్తుంఖ్వాలో కిలో ఎల్పీజీ ధర 600 రూపాయలకు పైగా పెంపు
- గ్యాస్ దొరక్క వంట కోసం కట్టెలు, బొగ్గు వాడుతున్న నగరవాసులు

ఢిల్లీ :

పాకిస్థాన్‌లో గ్యాస్ సంక్షోభం రోజురోజుకు తీవ్ర తరమవుతోంది. ముఖ్యంగా ఖైబర్ - మిగతా 2 లో

విశాఖలో ఆసియాన్-ఇండియా సదస్సు



- బ్లూ ఎకానమీపై నారా లోకేశ్ కీలక ప్రసంగం
- విశాఖలో ఘనంగా ఆసియాన్-ఇండియా మారిటైమ్ సదస్సు
- ఏపీని గ్లోబల్ మారిటైమ్ గేట్‌వేగా తీర్చిదిద్దుతామన్న లోకేశ్
- రాష్ట్రంలో శరవేగంగా నాలుగు నూతన పోర్టుల నిర్మాణం

వెస్ట్ బెంగాల్ పేరు

పశ్చిమ్ బంగా!

- వెస్ట్ బెంగాల్ పేరు మార్పునకు రంగం సిద్ధం
- వెస్ట్ బెంగాల్ పేరును పశ్చిమ్ బంగాగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం
- డిసెంబర్ 9న అసెంబ్లీలో అధికారికంగా తీర్మానం ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- జాతీయ సదస్సుల్లో ప్రాధాన్యత దక్కేందుకే అక్షర క్రమం మార్పు - మిగతా 2 లో

13 కార్పొరేషన్లలో కొలువుదీరిన

కొత్త పాలకవర్గాలు

- అట్టహాసంగా సాగిన ప్రమాణ స్వీకారాలు
- ఏపీలో 13 నగర పాలక సంస్థలకు సంబంధించి , మేయర్లుకార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు
- అనంతరం డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకున్నారు
- విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధా ప్రమాణ స్వీకారం



అమరావతి :

ఏపీలో తొలివిడతలో ఎన్నికలు జరిగిన 13 మున్సిపల్ కార్పొరేషన్లలో కొత్త పాలకవర్గాలు ఇవాళ కొలువుదీరాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు మేయర్లు, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా సాగింది. సభ్యుల ప్రమాణ స్వీకార ప్రక్రియ ముగిసిన వెంటనే డిప్యూటీ మేయర్లను పరోక్ష పద్ధతిలో చేతులెత్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇవాళ్టి నుంచే సభ్యుల పదవీకాలం ఐదేళ్ల పాటు ఉండనుంది.విశాఖపట్నం, విజయవాడ, విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం 1. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా జనసేన నేత వంగవీటి రాధాకృష్ణ ప్రమాణం చేశారు. ఈ మేరకు వీఎంసీ కార్యాలయంలో అభిమానులు, కూటమి కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత నగరంలోని 86 వార్డుల కార్పొరేటర్ల ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. విజయవాడ నగర ప్రథమ పౌరుడిగా వంగవీటి ప్రమాణం చేయడంతో ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ గా 12వ వార్డు సభ్యులు చెన్నుపాటి కాంతిశ్రీ - మిగతా 2 లో

రాబోయే రోజుల్లో డేటా ఆధారిత

నిర్ణయాలే కీలకం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీజీఎస్ సమీక్ష
- వైద్యం వ్యవసాయ రంగాల్లో ఏఐ వినియోగానికి సీఎం ఆదేశం
- ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని స్పష్టీకరణ
- డేటా ఆధారిత నిర్ణయాలతోనే పాలనలో మెరుగైన ఫలితాలు అని వెల్లడి
- ఉద్యోగుల పనితీరు పెంపునకు ప్రత్యేక శిక్షణ

అమరావతి :

వైద్యారోగ్యం నుంచి వ్యవసాయం వరకు అన్ని కీలక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుని పాలనలో మెరుగైన ఫలితాలు సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. - మిగతా 2 లో

సంపాదకీయం

ముగ్గురి ముచ్చట్లు...!

మూడు అతిపెద్ద అణ్వాయుధ దేశాల అధినేతలు ఒకే వేదికమీదకు రావడం, ఎదురెదురుగా కూర్చొని గంటన్నరకు పైగా మాట్లాడుకోవడం ఒక వింత. రెండో ప్రపంచయుద్ధం తరువాత అమెరికా, రష్యా, చైనా అధినేతల తొలి త్రైపాక్షిక భేటీ ఇది. ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్ సంక్షోభం, ఎడతెరిపి లేకుండా సాగుతున్న వాణిజ్య యుద్ధాల కాలంలో ఈ అగ్రరాజ్యాధినేతల మధ్య నేరుగా సంభాషణ జరగడం ఒక కీలక ఘట్టం. ప్రపంచాధిపత్యం కోసం పోటీపడుతున్న రెండు ఆర్థికశక్తుల నుంచి పరస్పర సహకారం, ఇచ్చిపుచ్చుకోవడం వంటి మాటలు రావడం వినసొంపుగా ఉంటుంది. నాలుగు అంశాల 'శాంతి ప్రకటన' తాత్కాలికంగానైనా ఓదార్పునిస్తుంది.ఈ మువ్వురి భేటీని 'యాల్టా 2.0' అన్నారు కొందరు. ఆర్భాటం ఎక్కువ, ఫలితం తక్కువ అని పెదవి విరిచారు మరికొందరు. రష్యా, చైనా అధ్యక్షులతో అమీతుమీ తేల్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నా, ట్రంప్ లక్ష్యం అది కాదు కాబట్టే ఈ భేటీ అంత ఘనంగా, సవ్యంగా సాగిపోయిందన్నవారూ ఉన్నారు. మధ్యంతర ఎన్నికల్లో ఎదురుదెబ్బతిని, ఇంట ఓడిన ఆయన రచ్చ గెలవాలనుకోవడం సహజం. మూడురోజుల ఆసియా పర్యటన, అందులో రెండు సదస్సులు, ఈ త్రైపాక్షిక భేటీ ఆయనకు ఉపశమనం కలిగిస్తాయి. జిన్‌పింగ్ ఆదరణ, ఆ హడావుడి, అట్టహాసం, వేలాదిమంది ఘనస్వాగతం తన పర్యటన విజయవంతమైందని చెప్పడానికి నిదర్శనాలన్నారాయన వెనక్కు తిరిగి వెడుతూ. ఇంతకు మించి ఆయన కోరుకున్నది ఏమీ లేదు. జిన్‌పింగ్‌ను ఆలింగనం చేసుకోవడం, పుతిన్‌ను క్లోజ్‌ఫ్రెండ్ అనడం అమెరికా రాజకీయ విశ్లేషకులకు మాత్రం ఆగ్రహం కలిగించింది. భౌగోళిక రాజకీయ ప్రత్యర్థులను ఇలా ఆకాశానికి ఎత్తేయడం, ఒక ప్రపంచవేదికమీద రష్యాను అమెరికాతో సమానం చేయడం విమర్శలకు తావిస్తోంది. మధ్యంతర ఎన్నికల్లో ఓడిన అమెరికా గతకాలపు అధ్యక్షులు కూడా ఇలా విదేశీపర్యటనలు చేసినవారే. అయితే, వ్యక్తిగతంగా కానీ, దేశానికి కానీ ఎక్కువకాలం ఆ ప్రయోజనాలు నిలబడలేదని కొందరు గుర్తుచేస్తున్నారు.ఈ భేటీ వెనుక ఎవరి ప్రయోజనాలు వారివి. అమెరికా, రష్యా అధినేతలను పిలిచి, వారి మధ్య నిలబడి, ప్రపంచ రాజకీయాలకు తానే కేంద్రబిందువు అనిపించుకున్నారు జిన్‌పింగ్. అమెరికాతో ఘర్షణపడకుండా చైనా విస్తరణ, ఆధిపత్యం కొనసాగితే చాలు ఆయనకు. పాశ్చాత్యదేశాలన్నీ తనను ఒంటరి చేసినా, ఈ ఇద్దరితో సమానంగా గౌరవాన్ని అందుకుంటూ, రష్యా ఇప్పటికీ ఎప్పటికీ అగ్రరాజ్యమేనన్న గుర్తింపు పుతిన్‌కు దక్కింది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు పరిధిని కట్టడి చేయాలన్న అంశాన్ని ఉమ్మడి ప్రకటనలో చేర్చడం ఆయనకు మరింత ఓదార్పును ఇచ్చింది. ఇజ్రాయెల్ మాజీ ప్రధాని నెతన్యాహూకు కూడా ఈ హేగ్ కోర్టు అరెస్టు వారెంట్ జారీచేసింది కనుక ట్రంప్‌కు కూడా అదంటే ఎలాగూ గిట్టదు. ప్రపంచదేశాల ప్రయోజనాలు, చమురు ధరల స్థిరత్వం పేరిట చేసిన నిర్ణయాలు, ప్రమాణాలూ రష్యాకే అధికంగా ఉపకరిస్తాయి కనుక పుతిన్‌కు ఇక అడ్డంకులు లేనట్టే. రష్యా చమురు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటున్న ఉక్రెయిన్‌కు ఇంధన భద్రత అన్నమాట ఒక హెచ్చరిక.ఐదేళ్ళుగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం, ఏడాదికి చేరువవుతున్న ఇరాన్ యుద్ధం ఇటువంటి భేటీల తరువాత ముగిసిపోతాయన్న భ్రమ ఎవరికీ లేదు.

13 కార్పొరేషన్లలో కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు

మొదటిపేజీ తరువాయి - ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ ఎన్నికకు కావాల్సిన కోరం ఉండటంతో కార్యక్రమాన్ని కొనసాగించిన ప్రిసైడింగ్ అధికారి ఉదయం 10 గంటల వరకూ డిప్యూటీ మేయర్ స్థానానికి కేవలం ఒకే అభ్యర్థిత్వం ఉన్నట్లు ప్రకటించారు. మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం అనంతరం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కార్యక్రమాన్ని చేపట్టగా కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు చెన్నుపాటి కాంతిశ్రీ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించగా 4వ డివిజన్ కార్పొరేటర్ దేవానంద్ కాంతిశ్రీ అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. దీంతో చెన్నుపాటి కాంతిశ్రీ డిప్యూటీ మేయర్ గా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ప్రకటించి ఆమెకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

2. విజయనగరం నగరపాలక సంస్థ నూతన మేయర్‌గా అవనాపు భార్గవి, డిప్యూటీ మేయర్‌గా ప్రసాదుల రజని బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారానికి ముందు మేయర్ భార్గవి, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కార్పొరేటర్లతో కలిసి టీడీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా వీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు తేజ్ భరత్ పర్యవేక్షణలో జరిగిన ప్రత్యేక సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి నూతన పాలకవర్గంతో ప్రమాణం చేయించారు. అనంతరం 25వ వార్డు టీడీపీ కార్పొరేటర్ ప్రసాదుల రజని డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు.

3. ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ కొలువుదిరింది. 62 మంది కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ రెడ్డి అప్పలనాయుడు మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఏలూరు జిల్లా కలెక్టర్ మేయర్, కార్పొరేటర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మేయర్‌గా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం రెడ్డి అప్పలనాయుడును కార్పొరేటర్లు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ఘనంగా సన్మానించారు.

4. మచిలీపట్నం మేయర్, కార్పొరేటర్ల ఎన్నిక అట్టహాసంగా జరిగింది. మచిలీపట్నం కార్పొరేషన్ సమావేశ భవనంలో నగరపాలక సంస్థ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరేట్ డీకే బాలాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత, మేయర్ అబ్దుల్ అబీదా ప్రమాణ స్వీకారం చేసింది. అనంతరం వరుస క్రమంలో 60మంది కార్పొరేటర్లు చేత ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం, కొట్టె వెంకటరావుని డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

5. గుంటూరు మేయర్‌గా కోవెలమూడి లక్ష్మీఅపర్ణ ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ మేయర్‌గా యర్రంశెట్టి రాజేశ్ ఏకగ్రీవ ఎన్నికయ్యారు. అనంతరం లక్ష్మీఅపర్ణ, రాజేశ్‌తో పాటు కార్పొరేటర్లతో కలెక్టర్ సాయికాంత్ వర్మ ప్రమాణం చేయించారు.

6. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌పై తెలుగుదేశం పార్టీ జెండా ఎగిరింది. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను ఆ పార్టీ కైవసం చేసుకుంది. మేయర్‌గా నల్లమల్లి శ్రీశిల్ప ప్రత్యర్థిపై భారీ మెజారిటీతో విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ మేయర్‌గా చావలి చార్వాక ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. మొత్తం 62 డివిజన్లున్న ఒంగోలు కార్పొరేషన్‌లో తొలిసారిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన 24 ఏళ్ల చార్వాక డిప్యూటీ మేయర్‌గా ఎన్నికవడం విశేషం. చిన్న వయసులోనే కీలక బాధ్యతలు చేపట్టిన ఆమె విజయం యువత రాజకీయాల వైపు అడుగులు వేసేందుకు స్ఫూర్తిగా నిలవనుంది.

7. నెల్లూరు నగర పాలక సంస్థ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. మేయర్‌గా ఎన్నికైన రూప్ కుమార్ యాదవ్‌తోపాటు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లతో ప్రిసైడింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతం డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించగా బీజేపీకి చెందిన 60వ డివిజన్ కార్పొరేటర్ రఘునాథరాజు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకార అనంతరం మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు రూప్ కూమార్‌ను మేయర్ సీటులో కూర్చోపెట్టారు. అందరి సహకారంతో నెల్లూరులో అభివృద్ధి చేస్తామని వారు ప్రకటించారు.

8. తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ గా మన్నెం శ్రీనివాసప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. తిరుపతి ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మేరకు 66 డివిజన్లకు సంబంధించిన కార్పొరేటర్లు, మేయర్ అభ్యర్థి శ్రీనివాసప్రసాద్‌తో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

9. చిత్తూరు మేయర్‌గా కఠారి హేమలత డిప్యూటీ మేయర్‌గా గోపీనాథ్ బాధ్యతలు స్వకరించారు. వారిద్దరితో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.

10. వైఎస్సార్ కడప నగరపాలక సంస్థ మేయర్‌గా సువర్ణ ప్రమాణస్వీకారం చేశారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మేయర్ సహా కార్పొరేటర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. డిప్యూటీ మేయర్‌గా టీడీపీ కార్పొరేటర్ మన్సూర్ ఆలీఖాన్ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో కడప, కమలాపురం ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సహా టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11. కర్నూలు నగరపాలక సంస్థ నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నూలు మేయర్ బొల్లెద్దుల ప్రత్యూష తొలుత ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కార్పొరేటర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత డిప్యూటీ మేయర్‌గా బీజేపీ కార్పొరేటర్ అంబలి కాశీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు.

12. అనంతపురం కార్పొరేషన్‌లో 62 డివిజన్ల నుంచి గెలుపొందిన కార్పొరేటర్లు, నగర మేయర్‌గా రమేశ్‌బాబు ప్రమాణం స్వీకారం చేసి పదవులు చేపట్టారు. ఈ మేరకు వారితో ఈ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రమాణం చేయించారు. అనంతరం డిప్యూటీ మేయర్ ఎన్నిక కోసం టీడీపీ నుంచి టి. స్వాతి నామినేషన్ దాఖలు చేసి, బీ-ఫారం అందించారు. డిప్యూటీ మేయర్ పదవికి కార్పొరేటర్లు ఎవరూ నామినేషన్‌కు ముందుకు రాకపోవడంతో స్వాతిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆనంద్ ప్రకటించారు. అనంతరం ఆమెతో డిప్యూటీ మేయర్‌గా ప్రమాణం చేయించారు.

13. మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్‌గా ముక్కా శ్రావణి ప్రమాణ స్వీకారంలో పాల్గొనలేదు. ఆమె తండ్రి ముత్యాలనాయుడు ఈ నెల 20న కన్నుమూశారు. శ్రావణి విజ్ఞప్తి మేరకు పాలకవర్గం ఏర్పాటైన మొదటి మూడు నెలల్లో లేదా మొదటి మూడు కౌన్సిల్ సమావేశాల్లో ఆమె మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయొచ్చని ఎస్ఈసీ ఉత్తర్వులిచ్చింది.దీంతో విశాఖ డిప్యూటి మేయర్‌గా పందిరి శివవెంకట ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన నుంచి కార్పొరేటర్‌గా గెలిచిన ఆయన్ని ఎంపీ శ్రీభరత్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రతిపాదించారు. ఇందుకు సభ్యులు ఆమోదం తెలపడంతో శివవెంకట ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. అంతకుముందు కార్పొరేటర్లందరితో జీవీఎంసీ ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఒకేసారి ప్రమాణ స్వీకారం చేయించారు.

రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలే కీలకం

మొదటిపేజీ తరువాయి - ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ స్టాక్ సాయంతో ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు, ఆయా శాఖల పనితీరును, ప్రభుత్వ ఆదాయాలను మెరుగుపర్చాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.పాలనా విభాగాల్లో రెవెన్యూ, లీగల్ ఏఐ స్టాక్ ద్వారా వివిధ అంశాలను విశ్లేషించి, అత్యుత్తమ ఫలితాలు రాబట్టేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం వివరించారు. రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలు (డేటా డ్రివెన్ డెసిషన్ మేకింగ్) అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ సమర్థ పనితీరుకు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలే నిదర్శనమని గుర్తుచేశారు.ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే వివిధ పౌర సేవలను మరింత సమర్థవంతంగా, వేగంగా చేరవేయడానికి తగిన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తికరమైన సానుకూల అభిప్రాయం ఏర్పడినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ ద్వారా ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులను ఏమాత్రం జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించాలని సీఎం అధికారులకు తేల్చిచెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార ప్రక్రియలో పర్యవేక్షణ లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని, ప్రతి శాఖ కూడా తన పనితీరును నిరంతరం సమీక్షించుకోవాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ, ఆర్థిక, పురపాలక, ఇంధన శాఖల ఉన్నతాధికారులు మరియు ఆర్టీజీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బుల్లెట్ రైలు ట్రయల్ రన్ కు ముహూర్తం ఫిక్స్

మొదటిపేజీ తరువాయి - అవుతుందని మంత్రి వివరించారు.ప్రారంభ దశలో నిర్వహించే ట్రయల్స్ కోసం ప్రత్యేకంగా 'బి-28' రైలును వినియోగించనున్నారు. ఈ రైలు గరిష్ఠంగా గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేశారు.సాధారణంగా గంటకు 240 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వెళ్లే రైళ్లను హైస్పీడ్ కేటగిరీగా పరిగణిస్తారు. వీటికి అత్యున్నత ఇంజనీరింగ్, కఠినమైన నిర్మాణ ప్రమాణాలు తప్పనిసరి. ఇంతటి అమిత వేగంతో దూసుకెళ్లే సమయంలో ఉత్పన్నమయ్యే గాలి పీడనాన్ని రైలు బోగీలు, ట్రాక్ మౌలిక వసతులు తట్టుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బి-28 రైలు ఇప్పటికే క్లిష్టమైన 'స్వింగ్ టెస్ట్'ను విజయవంతంగా అధిగమించిందని మంత్రి చెప్పారు. సాధారణ పరిస్థితుల కంటే రెండు రెట్ల వాతావరణ పీడనాన్ని సైతం తట్టుకునే సామర్థ్యాన్ని ఈ రైలు నిరూపించుకుందని ఆయన తెలిపారు.మరోవైపు మహారాష్ట్ర పరిధిలోని పనులు కూడా వేగంగా పురోగతి సాధిస్తున్నాయని, ముఖ్యంగా సముద్రగర్భ సొరంగం (అండర్‌సీ టన్నెల్) నిర్మాణం శరవేగంగా జరుగుతోందని మంత్రి వెల్లడించారు. మొత్తం 508 కిలోమీటర్ల నిడివితో నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్టు ద్వారా దేశ ఆర్థిక కేంద్రాలైన ముంబై, అహ్మదాబాద్ నగరాల మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది. బుల్లెట్ రైలు ప్రాజెక్టు ఇక కేవలం ఆలోచనలకే పరిమితం కాదని, క్షేత్రస్థాయిలో నిర్మాణాలు పూర్తి చేసుకుంటూ పట్టాలెక్కే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

పాకిస్థాన్‌లో తీవ్ర గ్యాస్ సంక్షోభం

మొదటిపేజీ తరువాయి - పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆధీనంలోని సుయ్ గ్యాస్ (పైప్‌లైన్ గ్యాస్) సరఫరాలో భారీ కోతలు విధించడంతో వంట చేసుకోవడానికి కూడా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ద్రవ్యోల్బణం, ప్రత్యామ్నాయ ఇంధనమైన లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) ధరలు ఆకాశాన్నంటడం వారిని మరింత కుంగదీస్తోంది.'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలో గ్యాస్ కొరత తీవ్ర స్థాయికి చేరింది. ఇళ్లలో గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఎల్పీజీ సిలిండర్ల వాడకం ప్రారంభించారు. దీంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగి, కిలో ఎల్పీజీ ధర 380 పాకిస్థానీ రూపాయల నుంచి 600 రూపాయలకు చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ధర 620 రూపాయల వరకు పలుకుతోంది. మరోవైపు, సీఎన్‌జీ కోసం పెషావర్‌లోని బంకుల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. సీఎన్‌జీ దొరక్క ఆటో రిక్షా డ్రైవర్లు కూడా ఎల్పీజీ వాడటం మొదలుపెట్టడంతో డిమాండ్, ధరలు మరింత పెరుగుతున్నాయి.ఈ గ్యాస్ కష్టాలు కేవలం ఖైబర్ పఖ్తుంఖ్వాకే పరిమితం కాలేదు. ఇస్లామాబాద్, రావల్పిండి వంటి నగరాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. 'ఆయిల్ అండ్ గ్యాస్ రెగ్యులేటరీ అథారిటీ' (ఓజీఆర్ఏ) కిలో ఎల్పీజీ ధరను 279 రూపాయలుగా నిర్ణయించినప్పటికీ, డీలర్లు 600 రూపాయలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్యాస్ కొరత, ధరల పెరుగుదలతో చాలా కుటుంబాలు వంట కోసం కట్టెలు, బొగ్గును ఆశ్రయిస్తున్నాయని 'డాన్' పత్రిక వెల్లడించింది."రోజుకు కేవలం ఆరు గంటలు, అదీ ఉదయం 7 నుంచి 9, మధ్యాహ్నం 12 నుంచి 2, సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు మాత్రమే గ్యాస్ వస్తోంది" అని ఓ స్థానికుడు వాపోయాడు. పరిస్థితి మరింత దారుణంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని, ఎల్పీజీ ధరలను నియంత్రించి, అధిక ధరలకు అమ్ముతున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వెస్ట్ బెంగాల్ పేరు పశ్చిమ్ బంగా!

మొదటిపేజీ తరువాయి - పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పేరును మార్చేందుకు అక్కడి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్ర ఆంగ్ల నామమైన 'వెస్ట్ బెంగాల్' స్థానంలో బెంగాలీ పేరైన 'పశ్చిమ్ బంగా'ను అధికారికంగా ఖరారు చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు డిసెంబర్ 9న అసెంబ్లీలో అధికారిక తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు.కోల్‌కతాలోని సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీ అనంతరం సీఎం వివరాలు వెల్లడించారు. "ఇకపై ఆంగ్లంలో కూడా రాష్ట్రాన్ని 'పశ్చిమ్ బంగా' అనే పిలుస్తారు. దీనికి సంబంధించిన తీర్మానాన్ని డిసెంబర్ 9న అసెంబ్లీలో ప్రవేశపెడతాం. సభ ఆమోదం పొందిన తర్వాత పార్లమెంటరీ, చట్టపరమైన ప్రక్రియల కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం" అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ పేరు మార్పు వెనుక బలమైన పాలనాపరమైన కారణం కూడా ఉంది. ప్రస్తుత పేరు ఆంగ్ల అక్షరమాల ప్రకారం 'ఔ' (డౌవర్ దీవఅస్ఫుశ్రీ)తో ప్రారంభమవుతోంది. దీనివల్ల జాతీయ స్థాయి సమావేశాలు, ముఖ్యమంత్రుల సదస్సులలో బెంగాల్ ప్రతినిధులకు చివరి వరుసలో మాట్లాడే అవకాశం వస్తోంది. దీనివల్ల సమయం సరిపోక రాష్ట్ర వాణిని బలంగా వినిపించలేకపోతున్నారు. ఈ సమస్యను అధిగమించి, అల్ఫాబెటికల్ జాబితాలో ముందు వరుసలోకి వచ్చేలా ఏ'తో మొదలయ్యేలా 'పశ్చిమ బంగా' పేరును ఖరారు చేశారు. అసెంబ్లీలో తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్ సవరణ కోసం కేంద్ర ఆమోదానికి పంపనున్నారు.

విశాఖలో ఆసియాన్-ఇండియా సదస్సు

మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సముద్ర వాణిజ్యం, పారిశ్రామిక రంగానికి ప్రధాన గేట్‌వేగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో ఇండియా ఫౌండేషన్, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన 'ఆసియాన్-ఇండియా మారిటైమ్ సదస్సు'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సముద్ర మార్గాల అనుసంధానత, సాంకేతికత, క్లీన్ ఎనర్జీ, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో ఆగ్నేయాసియా దేశాలతో ఆంధ్రప్రదేశ్ బలమైన, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని ఆయన తెలిపారు.విశాఖపట్నానికి గొప్ప సముద్ర చరిత్ర ఉందని, ఈ నగరం తూర్పు నౌకా దళానికి (ఈస్టర్న్ నేవల్ కమాండ్) ప్రధాన కేంద్రంగా ఉండటంతో పాటు శరవేగంగా ఐటీ, వాణిజ్య కేంద్రంగా ఎదుగుతోందని లోకేశ్ పేర్కొన్నారు. దేశంలోనే రెండో అతిపెద్ద తీరప్రాంతం (దాదాపు 1,053 కిలోమీటర్లు) కలిగిన ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు 91.17 మిలియన్ టన్నుల కార్గోను నిర్వహించి దాదాపు 10 శాతం వృద్ధితో సరికొత్త రికార్డు సృష్టించిందని ఆయన గుర్తుచేశారు.రాష్ట్రంలో సముద్ర రవాణా మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడలలో నాలుగు కొత్త పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని లోకేశ్ తెలిపారు. ఈ పోర్టులు ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల పారిశ్రామిక అవసరాలకు ఎంతో దోహదపడతాయని అన్నారు. అలాగే తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో దాదాపు రూ. 30,000 కోట్ల భారీ పెట్టుబడితో ప్రధాన షిప్‌బిల్డింగ్ (నౌకా నిర్మాణ) క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఇటీవల కాలంలోనే విశాఖ కేంద్రంగా పోర్టుల విస్తరణ, లాజిస్టిక్స్, ప్రత్యేక టెర్మినల్స్, షిప్ రిపేరింగ్ రంగాల్లో రూ. 7,500 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు (వీశీఖం) కుదిరాయని తెలిపారు. పోర్టులను పరిశ్రమలతో అనుసంధానించడం, తద్వారా ఆ పరిశ్రమల ఉత్పత్తులను గ్లోబల్ మార్కెట్లకు చేర్చడమే తమ వ్యూహమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను లోకేశ్ ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం బ్లూ ఎకానమీకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కొనియాడారు. సాగరమాల, మారిటైమ్ ఇండియా విజన్ 2030, మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047 వంటి బృహత్తర కార్యక్రమాలు దేశ ప్రగతికి బాటలు వేస్తున్నాయని చెప్పారు. నౌకా నిర్మాణ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర కేబినెట్ రూ. 25,000 కోట్ల డెవలప్‌మెంట్ ఫండ్‌తో కలిపి మొత్తం రూ. 70,000 కోట్ల భారీ ప్యాకేజీని ఆమోదించిందని గుర్తుచేశారు. దేశీయ వాణిజ్యంలో 95 శాతం సరుకు రవాణా సముద్ర మార్గం ద్వారానే జరుగుతున్నందున, అత్యాధునిక పోర్టుల నిర్మాణం ద్వారా వ్యాపార, పారిశ్రామిక రంగాలకు, ముఖ్యంగా యువత ఉపాధికి విస్తృత అవకాశాలు లభిస్తాయని లోకేశ్ స్పష్టం చేశారు.

నేపాల్ అభివృద్ధికి రూ.24 వేల కోట్ల ఆర్థిక సాయం

మొదటిపేజీ తరువాయి - హైదరాబాద్ హౌజ్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. భారత్- నేపాల్ భాగస్వామ్యంతో చేపట్టే అనేక ప్రాజెక్టులపై ఇరుదేశాల నేతలు చర్చించారు. రైలు, రోడ్డు కనెక్టివిటీ వంటి ప్రాజెక్టులకు సంబంధించి పలు ఒప్పందాలు చేసుకున్నట్లు భేటీ తర్వాత మోదీ, బాలేంద్ర సంయుక్తంగా ప్రకటించారు.నేపాల్‌లో స్టార్టప్ ఇంక్యుబేటర్, ఐఐటీ హబ్ ఏర్పాటు చేస్తామన్న మోదీ ఝాపా ప్రాంతంలో గ్రీన్ ఆయిల్ స్టోరేజ్ టెర్మినల్ నిర్మిస్తామని తెలిపారు. మోతిహరీ పైప్‌లైన్ ప్రాజెక్టు సహా బన్బాసా ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ ఏర్పాటుకు నేపాల్‌తో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. మహాకాళి నదిపై మోటరబుల్ వంతెన నిర్మించేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు మోదీ వివరించారు. అనంతరం ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్లి

తెలుగుపత్రిక
అక్షర మేధస్సు
మంగళవారం 24 - 11 - 2026

31వ వార్డు కౌన్సిలర్‌గా బి. నందీశ్వర్ ప్రమాణ స్వీకారం



గుంతకల్, నవంబర్ 23 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం అట్టహాసంగా నిర్వహించారు. నూతన ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకారంతో మున్సిపాలిటీలో నూతన పాలనకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి గుంతకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ చైర్మన్‌గా యశోద గౌడ్, వైస్ చైర్మన్‌గా ముక్కన్నగారి సాయి ప్రసాద్‌తో పాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన బి. నందీశ్వర్ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బి. నందీశ్వర్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలియజేశారు. 31వ వార్డు ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని స్థానికులు ఆకాంక్షించారు. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో గుంతకల్ పట్టణ అభివృద్ధి మరింత వేగవంతం కావాలని, అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, పట్టణ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని నూతన కౌన్సిలర్ బి. నందీశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

గుంతకల్ మున్సిపాలిటీ నూతన
పాలకవర్గం ఘనంగా ప్రమాణ స్వీకారం

21వ వార్డు కౌన్సిలర్‌గా ఉడదాల లక్ష్మి ప్రమాణ స్వీకారం



గుంతకల్, నవంబర్ 23 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. నూతన ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకారంతో మున్సిపాలిటీలో నూతన పాలనకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి గుంతకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ చైర్మన్‌గా యశోద గౌడ్, వైస్ చైర్మన్‌గా ముక్కన్నగారి సాయి ప్రసాద్‌తో పాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు అధికారుల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో భాగంగా 21వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన ఉడదాల లక్ష్మి పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఉడదాల లక్ష్మికి టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. 21వ వార్డు ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు ఆకాంక్షించారు. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో గుంతకల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, పట్టణ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని ఉడదాల లక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు.

గుంతకల్ మున్సిపాలిటీ నూతన
పాలకవర్గం ఘనంగా ప్రమాణ స్వీకారం

1వ వార్డు కౌన్సిలర్‌గా ఉడదల ప్రభాకర్ ప్రమాణ స్వీకారం



గుంతకల్, నవంబర్ 23 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. నూతన ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకారంతో మున్సిపాలిటీలో నూతన పాలనకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి గుంతకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ చైర్మన్‌గా యశోద గౌడ్, వైస్ చైర్మన్‌గా ముక్కన్నగారి సాయి ప్రసాద్‌తో పాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు అధికారుల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం 1వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన ఉడదల ప్రభాకర్ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉడదల ప్రభాకర్‌కు టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. 1వ వార్డు ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని స్థానికులు ఆకాంక్షించారు. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో గుంతకల్ పట్టణ అభివృద్ధి మరింత ప్రాధాన్యత లభిస్తుందని, అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, పట్టణ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని నూతన కౌన్సిలర్ ఉడదల ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

గుంతకల్ మున్సిపల్ చైర్మన్‌గా యశోద గౌడ్..

వైస్ చైర్మన్‌గా ముక్కన్నగారి సాయిప్రసాద్ ప్రమాణ స్వీకారం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సమక్షంలో నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

గుంతకల్, నవంబర్ 23 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. గుంతకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సమక్షంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నూతన మున్సిపల్ చైర్మన్‌గా యశోద గౌడ్, వైస్ చైర్మన్‌గా ముక్కన్నగారి సాయిప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ యశోద గౌడ్, వైస్ చైర్మన్ ముక్కన్నగారి సాయిప్రసాద్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమకు సహకరించిన ప్రజలకు, కౌన్సిలర్లకు, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ పట్టణ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తూ గుంతకల్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారంతో టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ పై ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో క్లెయిమ్స్ ను పరిష్కరించేందుకు చర్యలు..

వీడియో కాన్ఫరెన్స్ లో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కి వివరించిన

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..



అనంతపురం, నవంబర్ 23 అక్షర మేధస్సు అమరావతి, వెలగపూడిలోని ఏపీ సెక్రటేరియట్ లో ఉన్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం నుంచి సోమవారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) – 2026పై జిల్లా కలెక్టర్లు & జిల్లా ఎన్నికల అధికారులతో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) వివేక్ యాదవ్ సమీక్ష నిర్వహించారు.అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, డిఆర్ఓ ఏ.మలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ లేదా డూప్లికేట్ (ఘాణణ) లిస్ట్ 2,48,087 ఉన్నాయని, వీటన్నిటికీ ఎన్యుమరేషన్ ఫామ్స్ మళ్ళీ ఈనెల 30 లోపు అందజేయడం జరుగుతుందన్నారు. ఫారం 6, 7, 8 క్లెయిమ్స్ లకు సంబంధించి ఫారం 6 లో 4,296 క్లెయిమ్స్ వచ్చాయని, ఫారం 7 లో 35 మాత్రమే వచ్చాయని, ఫారం 8 లో 1,154 క్లెయిమ్స్ వచ్చాయని, క్లెయిమ్స్ అన్నింటినీ సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. క్లెయిమ్స్ ను నిరంతరంగా పర్యవేక్షించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

23వ వార్డు కౌన్సిలర్‌గా గుమ్మనూరు పార్వతి ప్రమాణ స్వీకారం



గుంతకల్, నవంబర్ 23 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం అట్టహాసంగా, ఘనంగా నిర్వహించారు. నూతన ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకారంతో మున్సిపాలిటీలో నూతన పాలనకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి గుంతకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ చైర్మన్‌గా యశోద గౌడ్, వైస్ చైర్మన్‌గా ముక్కన్నగారి సాయి ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 23వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన గుమ్మనూరు పార్వతి పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. 23వ వార్డు ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని స్థానికులు ఆకాంక్షించారు. గుమ్మనూరు పార్వతి ప్రమాణ స్వీకారం సందర్భంగా టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో గుంతకల్ పట్టణ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, 23వ వార్డు ప్రజలు, పట్టణ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిసింది.

బాలల భద్రతకు చట్టాలపై విద్యార్థులకు అవగాహన

గుంతకల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. భార్గవి



గుంతకల్, నవంబర్ 23 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గుంతకల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్. భార్గవి పేర్కొన్నారు. బాలికలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. సోమవారం గుంతకల్ పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలు (ఎస్సీ) 1, 2లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి ఎస్. భార్గవి విద్యార్థినులకు పలు కీలక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి ఎస్. భార్గవి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ సమాజానికి మచ్చ అని, చిన్నారుల చేతుల్లో పుస్తకాలు ఉండాల్సిన సమయంలో పనుల్లోకి నెట్టడం వారి బాల్యాన్ని, భవిష్యత్తును నాశనం చేయడమేనని వివరించారు. ప్రతి బాలబాలికకు విద్యను అభ్యసించే హక్కు ఉందని, బాల కార్మికత్వాన్ని ప్రోత్సహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత అభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయని తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థినులకు వివరించి, అలాంటి ఘటనలు ఎక్కడైనా జరిగినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

పోక్సో చట్టంపై ప్రత్యేక అవగాహన

సురక్షిత్ బచ్పన్ అభియాన్, బాల కార్మిక నిషేధ చట్టాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టాల గురించి విద్యార్థినులకు వివరించారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం రూపొందించబడిందని తెలిపారు. బాలికలు తమకు ఎదురయ్యే ఇబ్బందులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, మౌనంగా బాధపడకూడదని సూచించారు. చట్టాల గురించి తెలుసుకోవడం మాత్రమే కాకుండా, అవసరమైన సమయంలో వాటిని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోవడం కూడా ముఖ్యమని న్యాయవాదులు వివరించారు. చట్టపరమైన సహాయం అవసరమైన వారికి న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశం ఉందని తెలియజేశారు.

విద్యార్థినులతో నేరుగా మాట్లాడిన జడ్జి

న్యాయ అవగాహన సదస్సు అనంతరం జడ్జి ఎస్. భార్గవి విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి వ్యక్తిగత సమస్యలు, వసతి గృహంలో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను తెలియజేయాలని, వారి హక్కుల పరిరక్షణకు న్యాయ వ్యవస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం వసతి గృహంలోని వంటగదిని స్వయంగా పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిసరాల శుభ్రతను తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని సూచించారు.

పోక్సో అవగాహన పోస్టర్ల ప్రదర్శన

విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు పోక్సో చట్టానికి సంబంధించిన పోస్టర్లను వసతి గృహాల్లో ప్రదర్శించారు. బాలల హక్కులు, రక్షణ చర్యలు, చట్టపరమైన సహాయం పొందే విధానాల గురించి వివరించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థినుల్లో ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో బాలల భద్రతపై చైతన్యం తీసుకువస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వి. నాగరాజు, భాస్కర్ గౌడ్, బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ బి. తిమ్మప్ప, ఐసీడీఎస్ ప్రతినిధి రమాదేవి, వసతి గృహ వార్డెన్లు సుగుణమ్మ, జ్ఞానమ్మ, విద్యార్థినులు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు.

అట్టహాసంగా మేయర్ చిట్లూరు రమేష్, డిప్యూటీ మేయర్ స్వాతి, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం





అనంతపురం, నవంబర్ 23 అక్షర మేధస్సు అనంతపురం నగరంలోని నగరపాలక సంస్థలో ఉన్న కౌన్సిల్ హాల్ లో సోమవారం అనంతపురం నగరపాలక సంస్థ, ప్రత్యేక సమావేశం – 2026 ఏర్పాటు చేయగా, మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం మరియు డిప్యూటీ మేయర్ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. నగర పాలక సంస్థ ప్రిసైడింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ వారి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది.కౌన్సిల్ తరపున ముందుగా మేయర్ చిట్లూరు రమేష్ చేత, అనంతరం కార్పొరేటర్ల చేత ప్రిసైడింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశానికి మొత్తం 62 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు.

డిప్యూటీ మేయర్ గా 8వ డివిజన్ కార్పొరేటర్ టి.స్వాతి ఏకగ్రీవంగా ఎన్నిక

అనంతరం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికను ప్రిసైడింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ చేపట్టారు. ఇందులో డిప్యూటీ మేయర్ ఎన్నిక విధి విధానాలను తెలియజేశారు. చేతులెత్తే పద్ధతిలో డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించారు. కోరం ఉంది కాబట్టి డిప్యూటీ మేయర్ ఎన్నికను నిర్వహించారు 8వ డివిజన్ కార్పొరేటర్ టి.స్వాతిని డిప్యూటీ మేయర్ గా 56వ డివిజన్ కార్పొరేటర్ జి.లక్ష్మిరెడ్డి ప్రతిపాదించగా, 43వ డివిజన్ కార్పొరేటర్ రాజారావు బలపరిచారు. డిప్యూటీ మేయర్ పదవికి ఒకరే పోటీ చేయడంతో 8వ డివిజన్ కార్పొరేటర్ టి.స్వాతిని డిప్యూటీ మేయర్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. అనంతరం టి.స్వాతికి డిక్లరేషన్ ఫారాన్ని అందజేశారు. తదనంతరం డిప్యూటీ మేయర్ గా టి.స్వాతి ప్రమాణస్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫీషియో మెంబర్స్ పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, అనంతపురము అర్బన్ శాసన సభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత రావు, సంబంధిత మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పెనుకొండలో వైభవంగా 754వ బాబయ్య స్వామి ఉరుసు మహోత్సవం

బాబయ్య స్వామి దర్గాలో భక్తిశ్రద్ధలతో చాదర్ సమర్పించిన మంత్రి సవితమ్మ

రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు



పెనుకొండ నవంబర్ 23 అక్షర మేధస్సు పెనుకొండలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన 754వ బాబయ్య స్వామి ఉరుసు మహోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రి సవితమ్మ బాబయ్య స్వామి దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రభుత్వ అధికారికంగా సంప్రదాయబద్ధంగా చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గాలో భక్తితో ప్రార్థనలు చేసి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా దర్గాకు విచ్చేసిన మంత్రి సవితమ్మకు ఉరుసు మహోత్సవ నిర్వాహకులు, మతపెద్దలు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ మర్యాదలతో ఆమెను ఆహ్వానించి ఉరుసు మహోత్సవ విశేషాలను వివరించారు. అనంతరం మంత్రి దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ పెనుకొండలో ఎంతో చరిత్ర, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన బాబయ్య స్వామి ఉరుసు మహోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. స్వామివారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రైతులు, కార్మికులు, పేదలు, అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని స్వామివారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు బాబయ్య స్వామి ఉరుసు మహోత్సవం భక్తి, విశ్వాసం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐకమత్యం, మతసామరస్యం, పరస్పర గౌరవభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. 754వ ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని దర్గాలో ప్రత్యేక ఏర్పాట్లు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి సవితమ్మ చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఉరుసు నిర్వాహకులు, మతపెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయిబాబా 101వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

పెనుకొండలో మంత్రి సవితమ్మ కార్యాలయంలో చిత్రపటానికి

పూలమాల వేసి నివాళులు



పెనుకొండ, నవంబర్ 23 అక్షర మేధస్సు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 101వ జయంతి సందర్భంగా పెనుకొండలోని మంత్రి సవితమ్మ కార్యాలయంలో శ్రీ సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. “అందరినీ ప్రేమించు.. అందరికీ సేవ చేయు” అనే దివ్య సందేశంతో కోట్లాది మంది హృదయాల్లో కొలువైన మహనీయులు శ్రీ సత్యసాయిబాబా అని కొనియాడారు. మానవాళికి ప్రేమ, సేవ, మానవతా విలువలను బోధించడంతో పాటు నిస్వార్థ సేవే నిజమైన ఆధ్యాత్మికత అని తన జీవితాచరణ ద్వారా చాటిచెప్పారని పేర్కొన్నారు.విద్య, వైద్యం, తాగునీటి రంగాల్లో శ్రీ సత్యసాయిబాబా అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపాయని తెలిపారు. ఆయన చూపిన సేవామార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ మంత్రి సవితమ్మ, అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ గంజే నాగరాజు, ఉమ్మడి అనంతపురం జిల్లా ఏ డి డి సి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, శింగనమల నియోజకవర్గ టూ మెన్ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



రాయదుర్గం నవంబర్ 23 అక్షర మేధస్సు రాబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా రాయదుర్గం అర్బన్ సీఐ దేవానంద్ మల్లాపురం, మిచేరి, చడం, చడం గొల్లలదొడ్డి, బి.ఎన్. హళ్లి తదితర గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా సీఐ దేవానంద్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎవరూ గొడవలు, ఘర్షణలకు పాల్పడకూడదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగకుండా తమ ఓటు హక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ శాంతియుత ఎన్నికలకు సహకరించాలని సీఐ దేవానంద్ పిలుపునిచ్చారు.

ఏపీ కేబినెట్ సమావేశం నవంబర్

27కి వాయిదా.. హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహణ

నవంబర్ 26న జరగాల్సిన ఏపీ కేబినెట్ సమావేశం 27వ తేదీకి వాయిదా

23 పట్టణ స్థానిక సంస్థల పోలింగ్ ఉన్నందున తేదీ మార్పు చేస్తూ నిర్ణయం

కేబినెట్ నోట్ విడుదల చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్

హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

సచివాలయం నుంచి కొందరు వర్చువల్‌గా మరికొందరు మంత్రుల హాజరు



ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 26న జరగాల్సిన ఈ భేటీని నవంబర్ 27వ తేదీకి రీషెడ్యూల్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సంబంధించిన మార్పులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయిప్రసాద్ సోమవారం ఒక అధికారిక కేబినెట్ నోట్ ద్వారా వెల్లడించారు. రాష్ట్రంలోని 23 పట్టణ స్థానిక సంస్థలకు (అర్బన్ లోకల్ బాడీస్) సంబంధించి నవంబర్ 26వ తేదీన పోలింగ్ జరగనుంది. ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆ రోజున ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఆ ప్రక్రియలో నిమగ్నమై ఉండే అవకాశం ఉండటంతో, కేబినెట్ సమావేశాన్ని ఆ మరుసటి రోజు (నవంబర్ 27న) నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మంత్రివర్గ సమావేశాన్ని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించనున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అందుబాటులో ఉండే మంత్రులు నేరుగా భేటీకి హాజరుకావాల్సి ఉంటుంది. వివిధ కారణాల వల్ల వ్యక్తిగతంగా సచివాలయానికి రాలేని మంత్రులు వర్చువల్ విధానం (వీడియో కాన్ఫరెన్స్) ద్వారా సమావేశంలో పాల్గొనవచ్చని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలు కీలక ప్రభుత్వ విధానాలు, తాజా పరిణామాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

సనాతన ధర్మాన్ని కాపాడటం అంటే

పురాతన ఆలయాలను కూల్చడమేనా జగన్

తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలో అభయాంజనేయ స్వామి ఆలయం కూల్చివేత

కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన వైసీపీ అధినేత జగన్

ఎన్‌హెచ్ 716 విస్తరణ పనుల్లో భాగంగా ఆలయాన్ని తొలగించిన యంత్రాంగం

ఆలయానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరించిన మాజీ టీటీడీ చైర్మన్ భూమన

ధనిక వర్గాల ఆస్తులను కాపాడేందుకే అలైన్‌మెంట్ మార్చారని భూమన ఆరోపణ



తిరుపతి జిల్లా రేణిగుంట మండలం అంజనేయపురంలో శతాబ్దాల చరిత్ర కలిగిన అభయాంజనేయ స్వామి ఆలయాన్ని అధికారులు కూల్చివేశారంటూ వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని తప్పుబడుతూ ఆయన సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. “హే రామ్! ఆలయాలను రక్షించండి! ఆంధ్రప్రదేశ్‌ను కాపాడండి!” అంటూ వైఎస్ జగన్ తన సందేశంలో పేర్కొన్నారు. కోట్ల మంది భక్తుల విశ్వాసాలకు ప్రతీకగా ఉన్న పురాతన అభయాంజనేయ స్వామి ఆలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేయడం అత్యంత బాధాకరమని అన్నారు. గతంలో తిరుమల వెయ్యి కాళ్ల మండపం తొలగింపు, విజయవాడ కృష్ణా పుష్కరాల సమయంలో 40 ఆలయాల కూల్చివేత, బద్వేల్‌లోని కాశీనాయన జ్యోతి క్షేత్రం ధ్వంసం వంటి ఘటనలను ప్రస్తావిస్తూ, చంద్రబాబు హయాంలో ఎలాంటి ప్రత్యామ్నాయాలూ అన్వేషించకుండా పవిత్ర కట్టడాలను కూల్చివేసే ధోరణి కొనసాగుతోందని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ కోసం ‘శ్రీవాణి ట్రస్ట్’ను ఏర్పాటు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం చారిత్రక వారసత్వ సంపదను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. సనాతన ధర్మాన్ని రక్షించడమంటే ఇదేనా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మరోవైపు, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కూడా ఈ ఘటనపై తీవ్రస్థాయిలో స్పందించారు. జాతీయ రహదారి 716 విస్తరణ కోసం రోడ్డు మార్గాన్ని (అలైన్‌మెంట్) మార్చే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఈ పురాతన ఆలయాన్ని కూల్చివేసిందని ఒక వీడియో ప్రకటనలో ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ ధర్మాన్ని కాపాడే విధానం ఇదేనా అని ఆయన నిలదీశారు. కరకంబాడి సమీపంలో ఉన్న సంపన్న వర్గాల భూములు, ఆస్తులను కాపాడేందుకే జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను మార్చారని, దీనివల్లే చారిత్రక అభయాంజనేయ స్వామి ఆలయం బలైపోయిందని భూమన ఆరోపించారు. ఈ ఆలయ విశిష్టతను వివరిస్తూ, ఇక్కడి స్వామివారు స్వయంభూ అని, అగస్త్య మహర్షి భార్య లోపాముద్రతో ఈ క్షేత్రానికి సంబంధం ఉందని పేర్కొన్నారు. దాదాపు 1,400 ఏళ్ల క్రితం పల్లవ రాజులు ఈ ఆలయ గోపురం, కోనేరు నిర్మించారని, తాళ్లపాక అన్నమాచార్యులు కూడా స్వామివారిని కీర్తిస్తూ సంకీర్తనలు రచించారని గుర్తుచేశారు. కంచి కామకోటి పీఠాధిపతులు చంద్రశేఖరేంద్ర సరస్వతి, జయేంద్ర సరస్వతి సైతం ఇక్కడ విశేష పూజలు నిర్వహించారని తెలిపారు. ఈ ఆలయ ప్రాధాన్యతను గుర్తించే గతంలో బ్రిటిష్ పాలకులు కూడా మామండూరు సమీపంలో అంజనేయపురం రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేశారని వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం.. ప్రజల పక్షాన నిరంతర పోరాటం!

రాయదుర్గం నూతన మున్సిపల్ పాలకవర్గానికి

ఆమ్ ఆద్మీ పార్టీ శుభాకాంక్షలు



రాయదుర్గం నవంబర్ 23 అక్షర మేధస్సు రాయదుర్గం మున్సిపాలిటీ నూతన చైర్మన్‌గా, కౌన్సిలర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రజాప్రతినిధులందరికీ ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ అనంతపురం జిల్లా కన్వీనర్ డాక్టర్ వెంకటరమణ బాబు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో ప్రజల పక్షాన గొంతు వినిపించాలనే లక్ష్యంతో తాను పోటీ చేశానని తెలిపారు. ఈ ఎన్నికల ప్రయాణంలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికలు ముగిశాయని, ఇక రాజకీయాలకు అతీతంగా రాయదుర్గం పట్టణ అభివృద్ధికి నూతన పాలకవర్గం ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక వసతుల కల్పన, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, రహదారుల అభివృద్ధి, పారదర్శక పాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారం కోసం కాకుండా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. నూతన పాలకవర్గం ప్రజా సంక్షేమం, పట్టణ అభివృద్ధి దిశగా పనిచేస్తే పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు అదే సమయంలో ప్రజలకు అన్యాయం జరిగినా, ప్రజాధనం దుర్వినియోగమైనా చూస్తూ ఊరుకోబోమని, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకై నిలబడి నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. రాయదుర్గం పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడంలో నూతన పాలకవర్గం విజయవంతం కావాలని డాక్టర్ వెంకటరమణ బాబు ఆకాంక్షించారు.

కల్లూరు సర్పంచ్ అభ్యర్థి విభూది బాబయ్య జోరుగా ఇంటింటి ప్రచారం

ఇందిరమ్మ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా.. మౌలిక వసతులు కల్పిస్తా

ఓటు వేసి ఆశీర్వదించాలని కుటుంబ సభ్యులకు అభ్యర్థన



గార్లదిన్నె, నవంబర్ 23 అక్షర మేధస్సు ప్రతినిధి సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన విభూది బాబయ్య తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం ఇందిరమ్మ కాలనీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను కలుసుకుంటూ తనకు మద్దతు తెలిపి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కుటుంబాల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ప్రజలకు వివరించారు. ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న సమస్యలను స్వయంగా గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని విభూది బాబయ్య తెలిపారు. కాలనీలో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే బాధ్యత తనదేనని పేర్కొన్నారు. సర్పంచ్‌గా తనకు అవకాశం కల్పిస్తే గ్రామంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఓటర్లకు వివరించారు. ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థి విభూది బాబయ్యకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రశేఖర్, జగదీష్, వినోద్, మారెప్ప, ప్రసాద్, లోకేష్, అంజి తదితరులు పాల్గొన్నారు. ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది.

కూటమి నేతల అవినీతిని ఎండగడతాం

అనంతపురంను అభివృద్ధి పథంలో తీసుకెళ్తాం

వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ

కార్పొరేషన్ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు



అనంతపురం, నవంబర్ 23 అక్షర మేధస్సు ప్రతినిధి అనంతపురం కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ప్రజలకు తామిచ్చిన హామీ మేరకు ఈ నగరానికి కాపలాదారులుగా ఉంటామని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. కూటమి నేతల అవినీతిని ఎప్పటికప్పుడు ఎండగడుతూనే అనంతపురం నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. కార్పొరేషన్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం నేపథ్యంలో సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో మేయర్‌గా గెలిచిన రమేష్ గౌడ్‌తో పాటు 21 మంది కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనంతపురం నగరంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో ప్రజలందరికీ తెలుసని తెలిపారు. మేయర్‌గా రమేష్‌గౌడ్‌తో పాటు 21 మంది వైసీపీ కార్పొరేటర్లను గెలిపించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల్లో అనంతపురం ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అనంతపురంలో ప్రజలకు ప్రశాంతత కరువైందన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండాపోయిందని, జనం బిక్కుబిక్కుమంటూ బతికే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మేయర్ రమేష్ గౌడ్ నాయకత్వంలో అనంతపురంలో అభివృద్ధికి సహకరిస్తూనే ఎవరు అన్యాయంగా వ్యవహరించినా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటామన్నారు. కౌన్సిల్‌లో కార్పొరేటర్ల సంఖ్యాబలం తక్కువగా ఉన్నా బలమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో అనంతపురంలో రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కష్టంతో ఈ విజయం దక్కిందని, అన్ని డివిజన్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా మేయర్ రమేష్ గౌడ్ నాయకత్వంలో కార్పొరేటర్లు ముందుకు సాగుతారని తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు అనంతపురంలో పరిపాలన కొనసాగిస్తామని చెప్పారు.

తిరుపతిలో మరో కొత్త నగరం.. అలిపిరి వద్ద రూ.2,750 కోట్లతో మెగా టౌన్‌షిప్

తిరుపతిలో పిలిగ్రిమ్ టౌన్‌షిప్ ఏర్పాటుకు ఆమోదం

డిసెంబర్ 20 నుంచి 29 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు

సామాన్య భక్తులకు 92 శాతం దర్శన సమయం కేటాయింపు

రూ.7.5 కోట్లతో 500 నాటు ఆవుల కొనుగోలుకు నిర్ణయం

అలిపిరి నడక మార్గంలో కేబుల్ బ్రిడ్జిపై ఐఐటీ నిపుణులతో అధ్యయనం



తిరుపతిలోని అలిపిరి--ఎస్వీ జూ పార్క్ రోడ్డులోని స్థలంలో అత్యాధునిక సదుపాయాలతో పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. శ్రీవాణి ట్రస్ట్ నిధుల నుంచి రూ.2,750 కోట్ల అంచనా వ్యయంతో దీనిని చేపట్టనున్నారు. తిరుపతికి వచ్చే భక్తులకు ఒకేచోట మెరుగైన వసతి, ఆధునిక సదుపాయాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ ప్రాజెక్టు డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్), డిజైన్లు, పనుల పర్యవేక్షణ కోసం అనుభవజ్ఞులైన కన్సల్టెన్సీని నియమించేందుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ప్రణాళికా దశలోనే ఉంది.

డిసెంబర్ 20 నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు

ఈ ఏడాది డిసెంబర్ 20 నుంచి 29 వరకు మొత్తం 10 రోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. ఈ పది రోజుల్లో సుమారు 8.34 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 51 వేల మందికి అదనంగా దర్శన భాగ్యం కల్పించనుండటం విశేషం. మొత్తం దర్శన సమయంలో 92 శాతం సమయాన్ని సాధారణ భక్తులకే కేటాయించాలని నిర్ణయించారు.మొదటి రెండు రోజులైన వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో ఉచిత సర్వదర్శనం ఉండదు. కేవలం ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే ఎస్ఎస్‌డీ టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే దర్శనానికి అనుమతిస్తారు. మిగిలిన ఎనిమిది రోజులు సర్వదర్శనం యథావిధిగా కొనసాగుతుంది. అయితే ఈ ఎస్ఎస్‌డీ టోకెన్లను ఆన్‌లైన్‌లో ఎప్పుడు విడుదల చేస్తారనే తేదీని టీటీడీ ఇంకా ప్రకటించలేదు.

టీటీడీ మరికొన్ని కీలక నిర్ణయాలు

గో సంరక్షణ: ఆలయంలో నిత్య కైంకర్యాలు, శ్రీవారి ప్రసాదాల తయారీకి అవసరమైన స్వచ్ఛమైన పాలు, నెయ్యిని స్థానికంగానే ఉత్పత్తి చేసేందుకు రూ.7.5 కోట్ల వ్యయంతో 500 దేశీయ ఆవులను కొనుగోలు చేయనున్నారు.పర్యావరణం, పారిశుద్ధ్యం: తిరుమల క్షేత్రాన్ని నెట్-జీరోగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా పర్యావరణ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణ కోసం అదనంగా 348 మంది సిబ్బందిని నియమించనున్నారు.అటవీ పరిరక్షణ: శేషాచలం అటవీ ప్రాంత సంరక్షణ కోసం అటవీశాఖకు రెండేళ్ల కాలానికి రూ.16.4 కోట్లు విడుదల చేయడానికి ఆమోదం తెలిపారు.విద్య, వైద్య రంగాలు: స్విమ్స్ ఆసుపత్రి అభివృద్ధికి అదనంగా రూ.41.23 కోట్లు మంజూరు చేశారు. ఆయుర్వేద కళాశాలలో అదనంగా 20 బీఏఎంఎస్ సీట్లను పెంచనున్నారు. అలిపిరి సమీపంలోని శిల్పకళా కళాశాలలో 229 మంది విద్యార్థుల వసతి కోసం రూ.23 కోట్లతో నూతన హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నారు.కేబుల్ బ్రిడ్జి అధ్యయనం: అలిపిరి కాలినడక మార్గంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి మోకాళ్లమిట్ట వైపు కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఐఐటీ నిపుణులతో సమగ్ర అధ్యయనం చేయించాలని బోర్డు నిర్ణయించింది.

చేవెళ్లలో దొంగతనం ఫిర్యాదు చేసిన మహిళ హత్య: 24 గంటల్లో నిందితుడి అరెస్ట్

ఫోన్ దొంగతనంపై ఫిర్యాదు చేశారనే కోపంతో దారుణం

నిందితుడు 19 ఏళ్ల కేశావత్ శివశంకర్ అరెస్ట్

అతడి నుంచి సెల్‌ఫోన్, హత్యకు వాడిన కత్తి స్వాధీనం

నిందితుడిపై గతంలో ఏపీలోనూ దొంగతనం కేసులు ఉన్నట్లు గుర్తింపు



తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందన్న కక్షతో ఓ మహిళను దారుణంగా హత్య చేసిన 19 ఏళ్ల యువకుడిని చేవెళ్ల పోలీసులు 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. సెల్‌ఫోన్ దొంగతనంతో పాటు బ్యాంక్ ఖాతా నుంచి నగదు బదిలీ చేసిన వ్యవహారం ఈ హత్యకు దారితీసింది. నిందితుడి వద్ద నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్‌తో పాటు, హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన కేశావత్ శివ శంకర్ వరప్రసాద్ నాయక్ (19), బాతుల గురువులు అనే వ్యక్తి సెల్‌ఫోన్ దొంగిలించాడు. అనంతరం బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 45,000 నగదును తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన గురువులు, పద్మ అనే మహిళతో కలిసి ఈ నెల 21న చేవెళ్ల పోలీసులకు శివపై ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు చేసే సమయంలో పద్మ కూడా ఉండటంతో శివ ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే శనివారం తెల్లవారుజామున చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫరా కాలేజీ ఎదురుగా ఉన్న రేకుల షెడ్డు వద్ద పద్మపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.ఈ హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సాయంతో కేవలం 24 గంటల్లోనే నిందితుడు శివను పట్టుకున్నారు. నిందితుడిపై గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని వెలుగోడు పోలీస్ స్టేషన్‌లో రెండు దొంగతనం కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

Editor, Published & Owned By:N RANGANATH & Printed at M/S Achukatla Publications, # 9/1542, M.R.Road, Gooty R.S., Gooty - 515402, Ananthapuramu District. Andhra Pradesh. Published at # 1-3,Gajarampalli Village & Post, Pamidi Mandal, Pamidi - 515775 Ananthapuramu District. Andhra Pradesh. E-Mail:editorranganath@gmail.com
Cell: 8466071258 P.R.G.I. Regd. No:APTEL/26/A8343